ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5 అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

శనివారం 27 జూలై 2024

జనజీవనం అస్తవ్యస్తం

వరదలతో మన్యం వాసుల అవస్థలు

- వారం రోజులు పైబడి ముంచెత్తుతున్న వర్షం
- ఈదురుగాలులతో కూలుతున్న చెట్లు, తెగుతున్న విద్యుత్ తీగలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు, కొట్టుకుపోతున్న రోడ్లు
- రాకపోకలకు గిరిజనుల తిప్పలు
- మన్యంలో జరగని వారపు సంతలు
- నిత్యావసర సరకులకు ఇక్కట్లు

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది వర్షాలు గిరిజన ప్రాంతాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. వారం రోజులు పైబడి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు గిరిజనులపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచాయి. అధిక సంఖ్యలో గిరిజనులు ఇళ్లకే పరిమితమయ్యారు. ఏజెన్సీలో వారపు సంతలు జరగకపోవడంతో గిరిజనులు నిత్యావసర సరకులకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఈదురుగాలులకు చెట్లు పడిపోతుండడంతో విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతున్నది.



పాడేరు మండలం మర్రిపాలెంలో శుక్రవారం వర్షానికి కూలిన ఇల్లు



పెదబయలు మండలం జామిగెడ్డ గెడ్డను దాటేందుకు ఆనప డిప్పలు కట్టుకుంటున్న గిరిజనులు

జిల్లాలో వెయ్యికి పైబడి ఇళ్లు ధ్వంసం

జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాలకు వెయ్యికి పై బడి ఇళ్లు ధ్వంసమయ్యాయి. ప్రధానంగా వారం పైబడి వర్షం కొనసాగుతుండడంతో గోడలు నానిపోయి ఇళ్లు ధ్వంసమవుతున్నాయి. దీంతో అనేక మంది తాత్కాలిక నివాసాల్లో, పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు.

ముఖ్యంగా చింతూరు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్ పరిధిల్లో ఈ సమస్య అధికంగా ఉండగా, పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఒక మోస్తరుగా ఉంది. శుక్రవారం పాడేరు మండలం డి.గొందూరు పంచాయతీ మర్రిపాలెం గ్రామంలో ముక్తమ్మ అనే గిరిజన మహిళ ఇల్లు కూలిపోయింది. అయితే ఘటనలో ఎటువంటి ప్రమాదం జరగనప్పటికీ ఆ గిరిజన కుటుంబం తల దాచుకునేందుకు గూడు లేకుండా పోయింది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలా జిల్లా వ్యాప్తంగా ... మిగతా 8వ పేజీలో

వీడని ముసురు


తగ్గని ఈదురుగాలుల వర్షం

కొనసాగుతున్న వరద బీభత్స వాతావరణం

పాడేరు/అరకులోయ, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాను ముసురు వీడడం లేదు. శుక్రవారం సైతం ఈదురుగాలులతో కూడిన వర్షం కొనసాగింది. దీంతో జనం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈదురుగాలులులకు చెట్లు కూలిపోవడం, విద్యుత్ తీగలు తెగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నది. తాజా పరిస్థితి చూస్తే వర్షం తగ్గే సూచనలు ఏ మాత్రం కన్పించకపోవడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడంతో గెడ్డలు, వాగులు ఉధృతంగానే పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లా కేంద్రం మొదలుకుని అన్ని మండలాల్లో గెడ్డలు, వాగుల పరిస్థితి అలానే ఉంది, జిల్లాలోని వరద ప్రభావం అధికంగా ఉన్న చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఎం.జే.అభిషేక్ వరద సహాయక, పునరావస చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

అరకులోయలో రోజంతా వర్షమే

అరకులోయ, పరిసర ప్రాంతాలలో ముసురు వాతావరణం నెలకొంది. గత 5 రోజులుగా ఇదే ... మిగతా 8వ పేజీలో



శుక్రవారం సాయంత్రం పాడేరులో ముసురు వాతావరణం

శాకాంబరిగా ధారాలమ్మ



ధారాలమ్మ అమ్మవారిని శాకాంబరి అలంకరణ చేసిన దృశ్యం

జీకేవీధి మండలం ధారకొండ ఘాట్ రోడ్డులో కొలువుదీరిన ధారాలమ్మ అమ్మవారు శుక్రవారం శాకాంబరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రతీ ఏటా ఆషాడ మాసంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అలంకరించారు. -సీలేరు

వరదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచన
- మీ కోసంలో 75 వినతుల స్వీకరణ



వినతులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవోఅభిషేక్

పాడేరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వరదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వరదల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల సమయంలో ... మిగతా 8వ పేజీలో

సమస్యలపై ఇప్పటికైనా దృష్టి సారించేనా?

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

- ఉమ్మడి జిల్లాలో అనేక సమస్యలు
- అధ్వానంగా రహదారులు
- ఐదేళ్లుగా సాగునీటి వనరుల నిర్వహణ పనులు నిల్
- పాఠశాలల్లో అసంపూర్తిగా నాడు-నేడు పనులు
- సాధారణ ఎన్నికల తరువాత మొదటి సమావేశం
- కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు హాజరయ్యే అవకాశం

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం మొట్టమొదటిసారిగా శనివారం జరగనున్నది. గత సమావేశం నాటికి ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇప్పుడు లేరు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీ సీట్లు, 13 ఎమ్మెల్యే సీట్లను కూటమి (తెలుగుదేశం, జనసేన, బీజేపీ) కైవసం చేసుకుంది. అరకు ఎంపీ స్థానంతోపాటు పాడేరు, అరకు అసెంబ్లీ స్థానాలను వైసీపీ గెలుచుకుంది. రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్న వారితో పాటు కొత్తగా ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్న జడ్పీ తొలి సమావేశానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. జడ్పీలో వైసీపీకి మెజారిటీ ఉండగా, ఇద్దరు ఎంపీలు, పది మంది ఎమ్మెల్యేలు కూటమి తరపున ఉన్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది.



వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి జిల్లాలో ఏ సమస్యనూ పట్టించుకోలేదు. ప్రధానంగా రహదారులు అత్యంత దారుణంగా ఉన్నాయి. తాజాగా కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వానంగా తయారయ్యాయి. మరో మూడు నెలల పాటు వర్షాకాలం కొనసాగనున్నందున రోడ్ల మరమ్మతులకు తక్షణం నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ జడ్పీ సమావేశం తీర్మానం చేయాల్సి ఉంది. అలాగే ఐదేళ్లుగా కాలువలు, జలాశయాలు, గ్రోయిన్ల మరమ్మతులు ఊసే లేదు. చివరకు డ్యామ్‌ల నిర్వహణకు నిధులు లేవు. ఈ విషయంలో గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు పెద్దగా చొరవ చూపలేదు. ఈ ఏడాది ఖరీఫ్ పనులు సజావుగా సాగాలంటే జలాశయాలకు సంబంధించిన కాల్వల్లో పూడికలు తీయడం, చిన్నపాటి మరమ్మతులు చేయడంపైనైనా దృష్టిసారించాలి.

అలాగే వర్షాకాలం ప్రారంభం కావడంతో ఉమ్మడి జిల్లాలో మైదానం ప్రధానంగా ఏజెన్సీలో వ్యాధులు విజృంభిస్తున్నాయి. మారుమూల గిరిజన గ్రామాల్లో వైద్యం అందని పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతంతోపాటు పట్టణాల్లో వైద్య సేవల మెరుగుకు చర్యలు తీసుకోవాలి. కాగా 'నాడు-నేడు' పేరుతో రెండు దశల్లో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులు ప్రారంభించిన గత ప్రభుత్వం గడచిన ఏడాది నుంచి నిధులు ఇవ్వకపోవడంతో అనేకచోట్ల అసంపూర్తిగా నిలిచిపోయాయి. వీటి పూర్తికి నిధులు తెచ్చుకోవలసి ఉంది. వర్షాలతో ఏజెన్సీలో పాఠశాలల భవనాలు దెబ్బతినడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా చేపట్టిన జల జీవన్ మిషన్ పనుల్లో పెద్దఎత్తున అవినీతి జరిగింది. వీటితో పాటు జిల్లాలో నెలకొని ఉన్న పలు సమస్యలపై జడ్పీ సమావేశంలో సభ్యులు చర్చించే అవకాశం ఉంది.

గర్భిణులకు నిలిచిన వైద్య సేవలు

అందుబాటులో లేని స్త్రీ వైద్య నిపుణులు

- ఏరియా ఆస్పత్రిలో పేరుకు ముగ్గురు వైద్యులు
- ఒకరు చైల్డ్ కేర్ సెలవు, మరో ఇద్దరు డిప్యూటేషన్
- నిలిచిన అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఆరోగ్య తనిఖీలు
- ప్రసవం కష్టమైతే నర్సీపట్నం తరలింపు
- పట్టించుకోని అధికారులు

చింతపల్లి, జూలై 26: చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు వైద్య సేవలు అందడం లేదు. ఆస్పత్రిలో పేరుకు ముగ్గురు స్త్రీ వైద్యనిపుణులు ఉన్నప్పటికీ ఒక్కరూ అందుబాటులో లేరు. ఒకరు చైల్డ్ కేర్ సెలవుపై వెళ్లగా.. మరో ఇద్దరు పాడేరు జిల్లా ఆస్పత్రిలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. ఈ కారణంగా ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్, నెల వారి ఆరోగ్య తనిఖీలు నిలిచిపోయాయి.



చికిత్స కోసం నిరీక్షిస్తున్న గర్భిణులు



ఖాళీగా దర్శనమిస్తున్న స్త్రీ వైద్యనిపుణులు కుర్చీ

స్థానిక ఏరియా ఆస్పత్రికి చింతపల్లి, జీకేవీధి మండలాల్లోని 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలు చికిత్స కోసం వస్తుంటారు. గర్భిణులను ప్రసవం కోసం ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్నారు. దీంతోపాటు ప్రతి రోజు 50 నుంచి 100 మంది గర్భిణులు ఆరోగ్య తనిఖీలకు వస్తున్నారు. అలాగే శివారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలైన సీలేరు, ధారకొండ, పెదవలస, జీకేవీధి, కోరుకొండ, తాజంగితో పాటు ఇతర పీహెచ్‌సీల నుంచి గర్భిణులు అల్ట్రా సౌండ్ స్కానింగ్ కోసం ఇక్కడకు వస్తున్నారు. ప్రతి నెల 9, 10 తేదీల్లో ప్రధాన మంత్రి సురక్షిత మంత్రిత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రిలో గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. ఏరియా ఆస్పత్రిలో కొంత కాలంగా కేవలం ఒకే ఒక్క స్త్రీ వైద్యనిపుణురాలు అందుబాటులో ఉండడంతో పని భారం పెరిగిపోతున్నది. ప్రస్తుతం ఆమె కూడా సెలవుపై వెళ్లిపోవడంతో గర్భిణులకు వైద్య సేవలు పూర్తిగా నిలిచిపోయాయి.

పేరుకు ముగ్గురు స్త్రీ వైద్యనిపుణులు..

ఏరియా ఆస్పత్రిలో అధికారికంగా ముగ్గురు స్త్రీ వైద్యనిపుణులు ఉన్నారు. సివిల్ సర్జన్ సుధాశారద ఒక్కరు ... మిగతా 8వ పేజీలో



గండిపడిన రాసవీధి కల్వర్టును పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

కల్వర్టులకు ప్రతిపాదనలు పంపండి

ఇంజనీరింగ్ అధికారులకు పీవో అభిషేక్ ఆదేశం

- కొట్టుకుపోయిన రాసవీధి, అండంగిసింగి కల్వర్టుల పరిశీలన
- పెదలోచలి ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

జి.మాడుగుల, జూలై 26: మండలంలోని బొయితిలి పంచాయతీ రాస వీధి, కుంబిడిసింగి పంచాయతీ అండంగిసింగి కల్వర్టుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ టీడబ్ల్యూ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. 'భారీ వర్షాలతో కల్వర్టులకు గండి' శీర్షిక శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తపై పీవో స్పందించారు. గండి పడిన కల్వర్టులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అండంగిసింగి కాజ్‌వేపై హైలెవెల్ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పెదలోచలి ... మిగతా 8వ పేజీలో

ఒలింపిక్స్‌లో తెలుగు తేజం

100 మీటర్ల హర్డిల్స్‌లో ఎర్రాజీ జ్యోతి

- ఈ ఈవెంట్‌కు భారత్ నుంచి అర్హత సాధించిన తొలి మహిళా అథ్లెట్‌గా రికార్డు
- ఆగస్టు 7న రౌండ్-1 పోటీలు
- పతకంపై క్రీడా వర్గాల్లో కోటి ఆశలు

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 26: ఒలింపిక్స్‌లో నగరానికి చెందిన జ్యోతి వెలుగులు విరజిమ్మనుందా...అంతర్జాతీయ యవనికపై పసిడి పతకంతో మెరుపులీననుందా...క్రీడా వర్గాల్లో ప్రస్తుతం ఇదే చర్చ జరుగుతోంది. వందమీటర్ల హర్డిల్స్‌లో రికార్డులు తిరగరాయడాన్ని మంచినీళ్ల ప్రాయంలా చేసుకుని, పతకాలను కొల్లగొడుతున్న ఎర్రాజీ జ్యోతి ఒలింపిక్స్‌లోనూ అద్భుత ప్రతిభతో సత్తా చాటుతుందని, నగర ఖ్యాతిని విశ్వవీధిలో ఎగురవేస్తుందనే ఆశాభావంలో క్రీడా రంగం ఉంది.



అథ్లెట్ జ్యోతి

పారిస్ ఒలింపిక్స్‌లో నగరానికి చెందిన అంతర్జాతీయ మెరుపు అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి పాల్గొనడం విశాఖ క్రీడా రంగానికి గర్వ కారణంగా నిలిచింది. 100 మీ. హర్డిల్స్‌లో రికార్డులు తిరగరాస్తున్న జ్యోతి విశ్వక్రీడల్లో పతకం వైపు పరుగు తీసేందుకు సన్నద్ధమవుతోంది. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో జిల్లాస్థాయి నుంచి ఆసియా క్రీడల వరకు తాను ప్రాతినిధ్యం వహించిన ప్రతి రేస్‌లో పతకం సొంతం చేసుకుంటూ దూసుకుపోతున్న జ్యోతి ఒలింపిక్స్ 100 మీటర్ల హర్డిల్స్ రేస్ ఈవెంట్‌లో పరుగు తీయనున్న తొలి భారత్ మహిళా అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పింది. విశాఖ నుంచి నేరుగా ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న తొలి అథ్లెట్‌గానూ ప్రత్యేకతను సంతరించుకుంది.

పోర్టు స్కూల్ నుంచి పారిస్ వరకు

పోర్టు స్కూల్ గ్రౌండ్‌లో అథ్లెట్‌గా క్రీడా జీవితాన్ని ప్రారంభించిన జ్యోతి తాజాగా ఒలింపిక్స్‌లో పాల్గొనే స్థాయికి చేరింది. ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా సాధన కొనసాగించింది. జిల్లా, రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి క్రీడా నిపుణులను ఆకట్టుకుంది. అక్కడి నుంచి గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు శాప్ ఏర్పాటుచేసిన స్పోర్ట్స్ ఎక్సలెన్సీ సెంటర్‌లో చేరి ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నది. రిలయన్స్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న అకాడమీకి ఎంపికైన తర్వాత జ్యోతి పరుగు ప్రస్థానంలో చోటుచేసుకున్న మార్పులు ఆమె దశ, దిశను నిర్దేశించాయి. అనతికాలంలోనే 100 మీ. హర్డిల్స్‌లో టాప్ అథ్లెట్‌గా ఎదిగి పతకమే లక్ష్యంగా ఆమె తీసిన పరుగుకు జాతీయ రికార్డులు దాసోహమయ్యాయి. అంతర్జాతీయ ట్రాక్‌అండ్‌ఫీల్డ్‌లో ఆసియా క్రీడల వరకు ప్రతి మీట్‌లో దేశానికి పతకాలు అందించి అత్యున్నత అథ్లెట్లలో ఒకరిగా ఎదిగి ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించే స్థాయికి చేరింది.



ఆగస్టు 7న రౌండ్-1 పోటీల్లో

ఆగస్టు 7న మహిళల 100 మీ. హర్డిల్స్‌లో రౌండ్-1 (హీట్స్) పోటీల్లో జ్యోతి పాల్గొననుంది. ఆగస్టు 8న జరిగే రిపిచేజ్ రేస్ (హీట్స్‌లో క్వాలిఫై కానివారిలో బెస్ట్ టైమింగ్ ఉన్న అథ్లెట్లకు మరో అవకాశంగా నిర్వహించేది) ఉంటుంది. ఆగస్టు 9న సెమీఫైనల్, 10న ఫైనల్ రేస్ జరగనుంది.

క్రైం... crime news

వివాహిత హత్య

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని హత్య చేసిన భర్త


మృతి చెందిన జానకి

చింతపల్లి, జూలై 26: మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ తొర్త్రంపాడు గ్రామంలో దారుణం చోటు చేసుకున్నది. వివాహేతర సంబంధానికి భార్య అడ్డుపడుతుందని భర్త ఆమెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ కె. రమేశ్, కుటుంబ సభ్యులు అందించిన వివరాలిలా ఉన్నాయి.

లోతుగెడ్డ పంచాయతీ తొర్త్రంపాడు గ్రామానికి చెందిన కొర్ర రవి కుమార్ పెదబరడ పంచాయతీ చింతలూరు గ్రామానికి చెందిన గెమ్మెల జానకి (22)ని ప్రేమించి 2021లో వివాహం చేసుకున్నాడు. దంపతులు ఇద్దరు తొర్త్రంపాడు గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. రవికుమార్‌కు ఆరు నెలల క్రితం పిసిరిమామిడి గ్రామానికి చెందిన ఓ యువతి పరిచయమైంది. ఈ పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. పాడేరులో ఇటీవల జరిగిన అమ్మవారి జాతరలో రవికుమార్, పిసిరిమామిడి గ్రామానికి చెందిన యువతి కలిసి తిరిగినట్టు భార్య జానకి తెలుసుకున్నది. దీంతో జాతర నుంచి గృహానికి వచ్చిన భర్తను భార్య జానకి నిలదీసింది. నాటి నుంచి వారి మధ్య రోజూ గొడవలు జరుగుతున్నాయి. గురువారం మధ్యాహ్నం భార్యాభర్తల మధ్య అక్రమ సంబంధంపై మరలా గొడవ జరిగింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన రవికుమార్ మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తలగడతో శ్వాస ఆడకుండగా చేసి భార్యను హత్య చేశాడు. అనంతరం గృహంలో ఉరి వేసుకుని మరణించినట్టుగా చిత్రీకరించి ఆమె తల్లిదండ్రులకు సమాచారం పంపించాడు. మృతురాలు తల్లిదండ్రులు, బంధువులు సాయంత్రం తొర్త్రంపాడు గ్రామానికి చేరుకుని జానకి మృతిపై రవికుమార్‌ను నిలదీశారు. దీంతో తాను అక్రమ సంబంధం పెట్టుకున్నట్టు జానకి గొడవ చేస్తున్నందున హత్యచేసినట్టు ఒప్పుకున్నాడు. మృతురాలు తండ్రి దాసు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, గాలింపు చర్యలు చేపడుతున్నామని సీఐ రమేశ్, ఎస్ఐ రాజారావు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

సబ్బవరం, జూలై 26: అనారోగ్యంతో ఓ వివాహిత గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలివి. బోదివలస గ్రామానికి చెందిన గొల్లవిల్లి అప్పలరాజుతో రాజేశ్వరి(34)కు 2009లో వివాహం జరిగింది. వీరికి పద్నాలుగేళ్ల సుస్మిత, పన్నెండేళ్ల ప్రవల్లిక కుమార్తెలు ఉన్నారు. రెండో కుమార్తె తల్లిగర్భంలో ఉన్నప్పుడు రాజేశ్వరి ప్రమాదవశాత్తు మేడపై నుంచి జారి పడింది. ఆ సమయంలో ఆమె వెన్నెముకకు తీవ్ర గాయం కావడంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు చేయించారు. అయినప్పటికీ నొప్పి తగ్గలేదు. శస్త్ర చికిత్స చేయించాలని వైద్యులు చెప్పినా ఆర్థిక పరిస్థితుల కారణంగా చేయించలేదు. ఈ నేపథ్యంలో రెండు రోజుల నుంచి ఆమె వెన్నునొప్పితో బాధపడుతూ శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగింది. వాంతులు చేసుకుంటుండగా చిన్న కుమార్తె చూసి తండ్రికి సమాచారం అందించింది. 108 అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో రాజేశ్వరి మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఉరివేసుకుని మరో వివాహిత...

రాంబిల్లి, జూలై 26: మండలంలోని ఓ గ్రామంలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్టు రాంబిల్లి సీఐ నరసింగరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. చినపూడిలో గత ఆరు నెలలుగా కె.తేజేశ్వరి తన భర్తతో కలిసి నివాసం ఉంటుందన్నారు. శుక్రవారం ఉదయం విధులకు వెళ్లిన భర్త విధులు ముగించుకుని ఇంటికి చేరేసరి తేజేశ్వరి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించిందన్నారు. దీనిపై అందిన సమాచారం మేరకు మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు. పూర్తి వివరాలు విచారణలో తేలాల్సి ఉందని సీఐ వెల్లడించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, జూలై 26: ఇక్కడి జాతీయ రహదారిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్టు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. పొట్లపాటి మహంకాళి (27) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై విశాఖ వైపు వెళ్తుండగా, డైట్ కళాశాల జంక్షన్‌లో వెనుక నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడన్నారు. వెంటనే అతనిని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా, అక్కడి నుంచి వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు పంపినట్టు చెప్పారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడన్నారు. మృతుడి భార్య నాగరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆరు లైన్లుగా అనకాపల్లి- రాజమండ్రి రహదారి

» కేంద్ర మంత్రి గడ్కరీని కోరిన ఎంపీ సీఎం రమేశ్


మంత్రి గడ్కరీతో సమావేశమైన సీఎం రమేశ్

అనకాపల్లి, జూలై 26 (ఆంధ్ర జ్యోతి): కేంద్ర రోడ్లు, రవాణా, జాతీయ రహదారుల శాఖామంత్రి నితిన్ జయరామ్ గడ్కరీని న్యూఢిల్లీలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా అనకాపల్లి నుంచి రాజమండ్రి మధ్య ప్రస్తుతం ఉన్న రహదారిపై రద్దీ పెరగడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ రహదారిని ఆరు లైన్ల జాతీయ రహదారిగా నిర్మించాలని కోరారు. ఇందుకు సంబంధించి మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. దీంతో పాటు జిల్లాలో ఇతర రహదారుల అభివృద్ధి, కొత్తగా నిర్మాణాలపై మంత్రికి వివరించారు. వీటిపై మంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించారని ఎంపీ సీఎం రమేశ్ ఇక్కడి విలేకరులకు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

సబ్‌జైలులో న్యాయ అవగాహన సదస్సు

చోడవరం, జూలై 26: పట్టణంలోని సబ్ జైలులో శుక్రవారం స్థానిక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైదీలకు చట్టాలు ప్రభుత్వం అందించే న్యాయసహకారం తదితర అంశాలను గురించి వివరించడంతో పాటు నేరాలకు దూరంగా ఉండి జీవితాలను చక్కదిద్దుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె సబ్ జైలులోని సౌకర్యాలపై ఖైదీలతో మాట్లాడి ఆరా తీశారు. ఖైదీలకు ఇచ్చే ఆహారాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారి గణేష్, సిబ్బంది బాబూరావు, కె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పలాస పాసింజర్ గమ్యం కుదింపు.. పలు రైళ్లు రీ షెడ్యూల్

విశాఖపట్నం, జూలై 26: వాల్తేరు డివిజన్ పరిధిలోని పూండి, నౌపడ సెక్షన్‌లో ట్రాఫిక్ బ్లాక్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో విశాఖ-పలాస మధ్య నడుస్తున్న 07470, 07471 నంబర్లు గల మెము పాసింజర్ రైళ్లు ఈనెల 29, ఆగస్టు 1, 3వ తేదీల్లో విశాఖ-శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య రాకపోకలు సాగించనున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. శ్రీకాకుళం రోడ్డు, పలాస మధ్య రాకపోకలు తాత్కాలికంగా రద్దు చేసినట్టు పేర్కొన్నారు. కాగా, ఆగస్టు ఒకటన గంటన్నర భువనేశ్వర్- చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ (12830), ఆగస్టు 3న పూరి- గాంధీధాం ఎక్స్‌ప్రెస్ (22974), ఆగస్టు 3న భువనేశ్వర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (22879) రైళ్లు గంటన్నర ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేసినట్టు వివరించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చమ్మచింత అక్విడెక్టు వద్ద కుడికాలువకు గండి

10 అడుగుల మేర తాండవకు కొట్టుకుపోయిన మట్టి

నాతవరం, జూలై 26: మండలంలోని చమ్మచింత అక్విడెక్టును తాండవ డీఈ పి.అనురాధ శుక్రవారం పరిశీలించారు. ఈ అక్విడెక్టు వద్ద కుడి కాలువ మట్టి పది అడుగుల మేర పక్కనే ఉన్న తాండవనదిలోకి కొట్టుకుపోవడం పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సమస్యపై టీడీపీ నేతలు సమాచారం అందించడంతో డీఈ అనురాధ ఇక్కడకు వచ్చి పరిశీలించారు. దీనిపై మాజీ జడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ మాట్లాడుతూ ఇలాంటి సమయంలో తాండవ నీరు విడుదల చేస్తే కాలువకు గండి పడే ప్రమాదం ఉందన్నారు. అక్విడెక్టు కుడి కాలువ మరమ్మతు చేపట్టేందుకు అయ్యే ఖర్చుపై ప్రతిపాదనలు రూపొందించాలని ఏఈలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, మాజీ ఎంపీపీ సింగంపల్లి సన్యాసిదేముడు, నర్సీపట్నం టీడీపీ అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి, మాజీ ఎంపీటీసీ కాశపు నూకరాజు, అపన విజయ్, డైరెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మట్టి కొట్టుకుపోయిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఈ అనురాధ


మట్టి కొట్టుకుపోవడంతో ఏర్పడిన పది అడుగుల గొయ్యి

దేశ రక్షకులకు సెల్యూట్

» జిల్లా జడ్జి ఎన్.శ్రీవిద్య


కార్గిల్ అమరవీరుల దినోత్సవంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీవిద్య

అనకాపల్లి టౌన్, జూలై 26: దేశం కోసం ప్రాణత్యాగానికి సైతం వెనుకాడని సైనికులకు సెల్యూట్ అంటూ పదో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.శ్రీవిద్య అన్నారు. కార్గిల్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటైన కార్యక్రమంలో ఆమె అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తమ ప్రాణాలను, కుటుంబాన్ని పణంగా పెట్టి దేశం కోసం పోరాడుతున్న వారిని అంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సమాజ అభివృద్ధికి, శ్రేయస్సు కోసం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. న్యాయవాదులంతా సంఘటితంగా ఉండాలని కోరారు. అంతకు ముందు కార్గిల్ అమరవీరులకు న్యాయవాదులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంజేవీఎస్ కుమార్, కార్యదర్శి దుర్గారావు, ఉపాధ్యక్షురాలు రోజా తదితరులు పాల్గొన్నారు.


సైన్స్ ఎగ్జిబిషన్ పరిశీలిస్తున్న మురళీమోహన్ పట్నాయక్

టెక్నాలజీ ఆధారిత బోధనతో నైపుణ్యం

» జిల్లా అకడమిక్ మోనిటరింగ్ అధికారి మురళీమోహన్ పట్నాయక్

కె.కోటపాడు, జూలై 26: ఐఎఫ్‌పీ ప్యానెల్స్ ద్వారా విద్యార్థులకు బోధించి సాంకేతిక పరిజ్ఞానం నైపుణ్య అభివృద్ధి పెంపొందించవచ్చని జిల్లా అకడమిక్ మోనిటరింగ్ అధికారి మురళీమోహన్ పట్నాయక్ అన్నారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా శుక్రవారం స్కూళ్లలో డిజిటల్ వనరుల వినియోగంపై ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ఏ.కోడూరు జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ట్యాబ్‌ల వినియోగం, విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. పాఠశాలలో గల అటల్ టింకరింగ్ ల్యాబ్ పరిశీలించి నిర్వహణ, విద్యార్థుల ప్రతిస్పందనపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1 కె.సత్యనారాయణ, ఎంఈవో -2 డీవీడీ ప్రసాద్, డీఎస్‌వీఆర్‌కై నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓపెన్ బార్‌గా సంత పాకలు

» ఇబ్బంది పడుతున్న ఏటికొప్పాక మహిళలు
» పలు సందర్భాల్లో మందుబాబుల వీరంగం
» చర్యలు తీసుకోవాలని పోలీసులకు వినతి


ఏటికొప్పాక సంత పాకలో ఉన్న మద్యం సీసాలు

ఎలమంచిలి, జూలై 26 : ఏటికొప్పాక వారపు సంతలో ఏర్పాటు చేసిన పాకలను మద్యం బాబులు ఓపెన్ బార్లుగా మార్చేశారు. దీంతో స్థానికులతో పాటు హస్తకళాకారుల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని ఏటికొప్పాకలో ప్రతి మంగళవారం వారపు సంత జరుగుతుంది. పంచాయతీ అధికారుల అనుమతి మేరకు సంతలో దుకాణదారులు పాకలను వేసుకున్నారు. సంత రోజు మాత్రమే వ్యాపారులు వీటిని వినియోగిస్తారు. మిగిలిన రోజులన్నీ ఈ దుకాణాలు ఖాళీగా ఉంటాయి. వీటిని కొందరు మందుబాబులు బార్లుగా మార్చేశారు. ఈ దుకాణాల్లో పగలు, రాత్రి అని తేడా లేకుండా మద్యం సేవించి, సీసాలను పగులగొడుతున్నారు. అక్కడే మల, మూత్ర విసర్జన చేసేస్తున్నారు.చెంతనే హస్త కళాకారుల కాలనీ ఉండడంతో మద్యం బాబుల వికృత చేష్టలకు కాలనీలోని మహిళలు అసౌకర్యానికి గురవుతున్నారు. మందుబాబులతో కాలనీ వాసులు గొడవ పడుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. వారపు సంత నిర్వహణ కోసం ఏర్పాటు చేసుకున్న దుకాణాలను ఓపెన్ బార్లుగా వినియోగిస్తున్న మందుబాబుల ఆటలు కట్టడి చేయాలని కాలనీవాసులు పోలీసులను కోరుతున్నారు.

15 లేదా 20న తాండవ నీరు విడుదల

రైతుల సూచనను అంగీకరించిన తాండవ అధికారులు

కాలువల్లో పూడిక తీయించాలని కోరిన ఆయకట్టు రైతులు


ఆయకట్టు రైతుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈ అనురాధ

నాతవరం, జూలై 26: రైతుల కోరిక మేరకు తాండవ నీరు ఆగస్టు 15 లేదా 20వ తేదీల్లో విడుదల చేస్తామని తాండవ డీఈఈ అనురాధ తెలిపారు. ఖరీఫ్‌కు తాండవ నీరు విడుదలపై అనకాపల్లి, కాకినాడ జిల్లాల ఆయకట్టు రైతులతో శుక్రవారం స్థానిక తాండవ సెక్షన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తాండవ రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం 371 అడుగుల నీరు ఉందన్నారు. ఈ నీరు 52 వేల ఎకరాలకు 60 రోజులు సరిపోతుందన్నారు. అయితే రానున్న రోజుల్లో వర్షాలు ఉన్నందున్న తాండవలోకి మరింతగా నీరు చేరేందుకు అవకాశం ఉందన్నారు. అందువల్ల రైతులు ఎప్పుడు నీరు విడుదల చేయమని చెబితే అప్పుడు విడుదల చేస్తామని డీఈఈ అనురాధ అన్నారు. దీంతో మెజారిటీ రైతులు ఆగస్టు 15 లేదా 20 తేదీల్లో సాగు నీరు విడుదల చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మొండికండి గ్రామానికి చెందిన రైతు శ్రీరంగస్వామి మాట్లాడుతూ రెండేళ్ల నుంచి తాండవ కుడి, ఎడమ కాలువల్లో పూడిక తీయ్యలేదని, కాలువల్లో జంగిల్ క్లియరెన్స్ చేయలేదని, దీనివల్ల చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదన్నారు. తక్షణమే కాలువల్లో పూడిక తీయాలని కోరారు. రాష్ట్ర పామ్ఆయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు మాట్లాడుతూ తాండవ కాలువల నిర్వహణ, తలుపుల మరమ్మతులకు గురయ్యాయన్నారు. మార్చి నెలలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ఏఏ ప్రాంతాల్లో కాలువలు, తలుపులు దెబ్బతిన్నాయో తెలుసుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కాకినాడ జిల్లా కేఈ చిన్నయ్యపాలెం మాజీ సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ ప్రతి పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ అధికారుల ద్వారా తాండవ కుడి, ఎడమ కాలువల్లో పేరుకుపోయిన తుప్పలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటరమణ, ఎంపీపీ ఎస్.లక్ష్మణమూర్తి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరక సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యుడు కె.అప్పలనర్స, తాండవ మాజీ చైర్మన్ పి.కొండబాబు, తాండవ ఏఈలు వినయ్‌కుమార్, శ్యామ్ పాల్గొన్నారు.

పంచ గ్రామాల సమస్య పరిష్కారం దిశగా...

» భూ వివాదంపై దేవదాయ శాఖా మంత్రి ఆనం అధ్యక్షతన అమరావతిలో విస్తృత స్థాయి సమావేశం


అమరావతిలో మంత్రితో సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు

సింహాచలం, జూలై 26: సింహాచల దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచ గ్రామాల భూ వివాదం పరిష్కారం దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ముందడుగు వేసింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి నగరంలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో లక్షలాది మందికి సంబంధించిన సమస్య పరిష్కారం కోసం నడుంబిగించింది.

పంచ గ్రామాల భూ సమస్యపై ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో శుక్రవారం అసెంబ్లీ ఆవరణలోని సమావేశ మందిరంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమావేశం ఏర్పాటుచేసి, సమగ్రంగా చర్చించారు. ఆ వివరాలను దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఎస్.సత్యనారాయణ పత్రికలకు విడుదల చేశారు. రాష్ట్ర హైకోర్టులో 2019లో దాఖలైన వ్యాజ్యానికి లోబడి జీవో 229లో పేర్కొన్న రేట్ల ప్రకారం 12,149 నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టాలని, అందుకు సంబంధించిన న్యాయపరమైన చిక్కులపై నివేదిక సిద్ధం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ క్రమబద్ధీకరణ వల్ల సింహాచలం దేవస్థానానికి కలిగే నష్టాన్ని భర్తీ చేయనున్నారు. సుమారు 421 ఎకరాలకు సమాన విలువ ఉండే విధంగా ప్రాథమికంగా గుర్తించిన 853.6 ఎకరాల బదలాయింపుతో పాటు అవసరాల నిమిత్తం రహదారికి అనుసంధానంగా ఉన్న మరికొంత భూమిని గుర్తించి ప్రతిపాదనలను ప్రభుత్వానికి సత్వరం సమర్పించాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరీంధిర్ ప్రసాద్‌ను మంత్రి రామనారాయణరెడ్డి ఆదేశించారు. దాని ఆధారంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనుమతితో హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసి కోర్టు నుంచి ఉత్తర్వులు పొంది కట్టడాలను క్రమబద్ధీకరించేందుకు తగిన చర్యలు చేపడతామని మంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పీవీజీఆర్ నాయుడు, వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్‌బాబు, కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, పి.విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాసయాదవ్, దేవదాయ శాఖ అదనపు కమిషనర్ కేపీ రామచంద్రమోహన్, ప్రాంతీయ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా కనకదుర్గమ్మ


శాకంబరీదేవిగా దర్శనమిచ్చిన కొత్తకోట శ్రీకనకదుర్గ

రావికమతం, జూలై 26 : ఈ ప్రాంతంలో అత్యంత ప్రసిద్ధి గాంచిన కొత్తకోట శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు శనివారం భక్తులకు శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. ఆషాడ మాసం శుక్రవారం పర్వదినం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేపా రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి 40 రకాల పండ్లు, కాయ, ఆకు కూరలతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ అలంకరణ భక్తులకు ఎంతగానో ఆకట్టుకుంది.

28న శాకంబరి అలంకరణలో నూకాంబిక దర్శనం


బాలాలయంలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి టౌన్, జూలై 26: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేపడుతున్నట్టు ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. అమ్మవారి ఉత్సవ మూర్తికి అలంకరణ నిమిత్తం కూరగాయలు ఇవ్వదలచిన దాతలు దేవస్థానానికి ఇచ్చేసి తగు రశీదు పొందాల్సిందిగా ఆయన కోరారు.

ప్రముఖ రంగస్థల నటుడు ఈశ్వరరావు కన్నుమూత


ఈశ్వరరావు (ఫైల్ ఫొటో)

అనకాపల్లి టౌన్, జూలై 26: ప్రముఖ రంగస్థల నటుడు మిర్తిపాటి ఈశ్వరరావు (75) అనకాపల్లి పట్టణ శివారునున్న కొప్పాకలో మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం సాయంత్రం కన్నుమూశారు. ఈయన తన 15వ ఏట నుంచి నాటకాల్లో నటించడం మొదలు పెట్టారు. అనేక నాటకాల్లో వివిధ పాత్రల ద్వారా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఆరు దశాబ్దాలుగా నాటక రంగంలో ప్రసిద్ధి చెందిన ఈయన రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ కొప్పాక ఈశ్వరరావు అంటే అందరికీ సుపరిచితులు. ఈశ్వరరావు మృతి పట్ల మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ కౌన్సిలర్ కె.ఎం.నాయుడు, డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, దాడి జయవీర్, దేవాదుల శివాజీ, పలువురు రంగస్థల కళాకారులు సంతాపం తెలిపారు.

కొళాయిల నుంచి కలుషిత నీరు

» స్థానికుల ఆందోళన


పట్టణంలో కొళాయిల నుంచి వస్తున్న కలుషిత నీరు

చోడవరం, జూలై 26: పట్టణంలోని పలు కాలనీల్లో రెండు రోజులుగా పంచాయతీ వీధి కొళాయిల నుంచి కలుషిత నీరు సరఫరా అవుతుండడంపై స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కొళాయిల నుంచి వచ్చే నీరు నల్లరంగులో ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వేసవి సీజన్‌లో పట్టణంలోని రక్షిత మంచి నీటి పథకం ట్యాంకులలో కలుషిత నీరు సరఫరా కావడంతో పంచాయతీ సిబ్బంది ట్యాంకులను పరిశుభ్రం చేశారు. అయినప్పటికీ మళ్లీ కొళాయిల నుంచి కలుషిత నీరు సరఫరా అవుతుండడం విమర్శలకు దారితీస్తున్నది. ఇలాంటి నీరు తాగితే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఒక పక్క పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారని, మరో పక్క కొళాయిల నుంచి కలుషిత నీరు సరఫరా చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. వెంటనే పంచాయతీ అధికారులు స్పందించి కొళాయిల ద్వారా మంచినీరు సరఫరా అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీతో టోకరా

» నగరానికి చెందిన మెకానికల్ ఇంజనీర్ నుంచి రూ.28 లక్షలు గుంజిన హైదరాబాద్ ముఠా

ఎండాడ (విశాఖపట్నం), జూలై 26: ఆన్‌లైన్‌లో డేటింగ్ వెబ్‌సైట్ ద్వారా పెళ్లి కాని యువకులను పరిచయం చేసుకుని, వారి నుంచి డబ్బులు గుంజుతున్న మోసగాడిని విశాఖపట్నం సైబర్ పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ స్టేషన్ సీఐ కె.భవానీప్రసాద్ అందించిన వివరాల ప్రకారం...హైదరాబాద్‌కు చెందిన కొమ్మగోని లోకేష్ డేటింగ్ వెబ్‌సైట్ ద్వారా పలువురికి అమ్మాయిగా పరిచయం అవుతాడు. ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీని క్రియేట్ చేసి అందులో కొంతకాలం చాట్ చేస్తాడు. అందమైన అమ్మాయిల ఫొటో పంపి దగ్గరైనట్టు మెసేజ్‌లు పెడతాడు. ఆ తరువాత అత్యవసరమంటూ డబ్బులు గుంజుతాడు. ఈ విధంగా నగరానికి చెందిన అవివాహితుడైన మెకానికల్ ఇంజనీర్‌కు వల వేశాడు. దఫదఫాలుగా రూ.28 లక్షలు రాబట్టుకున్నాడు. తాను మోసపోయానని గుర్తించిన మెకానికల్ ఇంజనీర్ నగరంలోని సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు సాంకేతికతను వినియోగించి నిందితుడు హైదరాబాద్‌కు చెందిన లోకేష్‌గా గుర్తించి అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో అతనికి సహకారించిన హైదరాబాద్‌కు చెందిన మరో ఇద్దరు నిందితులు ఆర్.సాయి ధీరజ్, షాలినీ పరారీలో ఉన్నారు. వారిని అరెస్టు చేయాల్సి ఉందని సీఐ పేర్కొన్నారు.

తుఫాన్ మిగిల్చిన న(క)ష్టం..

- మన్యంలో కొనసాగుతున్న వర్షాలు.. ఈదురుగాలులు
- ఎక్కడికక్కడే నేలకొరిగిన భారీ వృక్షాలు... కూలిపోయిన ఇళ్లు
- చాలా గ్రామాల్లో వరద నీటి ముంపులోనే పంట పొలాలు
- నిరాశ్రయులైన గిరిజనులు.. దీనావస్థలో రైతులు


అరకులోయ ప్రధాన రహదారిలో హోరున కురుస్తున్న వాన

మన్యాన్ని తుఫాన్ అతలాకుతలం చేసింది. భారీ వర్షాలతో తీరని నష్టం మిగిల్చింది. ఈదురుగాలులతో చాలా గ్రామాల్లోని ఇళ్లపై చెట్లు కూలిపోయి గిరిజనులను నిరాశ్రయులను చేసింది. వరద నీటి ప్రవాహంతో కాజ్‌వేలు, పంట పొలాలు కొట్టుకుపోయి రైతులను నష్టాల్లోకి నెట్టింది.

పాడేరు రూరల్/కొయ్యూరు/గూడెంకొత్తవీధి/జి.మాడుగుల/పెద బయలు/ముంచంగిపుట్టు/డుంబ్రిగుడ/హుకుంపేట, జూలై 26: మన్యంలో ముసురు కొనసాగుతోంది. వారం రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. శుక్రవారం కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు వాన పడింది. దీంతో శుక్రవారం అరకు వారపు సంతలో అనుకున్నంత వ్యాపారం సాగక వర్తకులు ఆందోళన చెందారు. సుంకరమెట్టలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. డుంబ్రిగుడ మండలంలో పది రోజులకుపైగా కురుస్తున్న వర్షాల కురుస్తున్నందున సంపంగిగెడ్డ, కితలంగి కాజ్‌వే, చంపాపట్టి, చాపరాయి, గోరాపూర్ గెడ్డల ప్రవాహంతో బయటి ప్రపంచానికి దూరంగా గిరిజనుల రాకపోకలు స్తంభించాయి. బయటి ప్రపంచానికి గిరిజనులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. హుకుంపేట మండలంలోని రంగశీల, సూకురు, తిగలవలస, తడిగిరి, ముల్యపుట్టు తదితర పంచాయతీల్లో వరద నీటి ఉధృతికి పంట పొలాలు కొట్టుకుపోయాయి. పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పాడేరులోని మర్రిపాలెం గ్రామంలో కిల్లో ముత్తాయికి చెందిన రేకుల ఇల్లు నేలకూలింది. దీంతో ఆ కుటుంబీకులు నిరాశ్రయులయ్యారు. డి.గొందూరు పంచాయతీ మర్రిపాలెం గ్రామానికి చెందిన ముత్తాయి ఇల్లు వర్షానికి పూర్తిగా నానిపోయి గోడలు కూలిపోవడంతో సామగ్రి మట్టిపాలయ్యాయి. ముంచంగిపుట్టు మండల కేంద్రంతో పాటు కించాయి పుట్టు, జర్జుల, జర్రెల, బూసిపుట్టు, బుంగాపుట్టు, బాబుసాల, రంగబయలు, దోడి పుట్టు, జోలాపుట్టు, వనుగుమ్మ, బంగారుమెట్ట తదితర పంచాయతీలోని పలు చోట్ల వరి పంట తీవ్రంగా దెబ్బతింది. వరదనీటి ఉధృతికి పంట కొట్టుకుపోవడంతో పాటు పొలాల్లో మట్టి దిబ్బలు పేరుకుపోయాయి. అలాగే వనుగుమ్మ పంచాయతీ దొమిని పుట్టు గ్రామంలో విద్యుత్ స్తంభంతో పాటు కె.సుఖదేవ్ ఇల్లు నేలకూలాయి. టిక్రపడ గ్రామంలో జె.ఆనందరావు, కొత్తసుజనకోటకు చెందిన ఆర్.మొనీమ ఇల్లు నేలమట్ట మయ్యాయి. అలాగే మరి కొన్ని గ్రామాల్లో ఇళ్ల గోడలు పడిపోయాయి. కొయ్యూరు మండలంలోని బూదరాళ్ల పంచాయతీ పోకలపాలెం గ్రామంలో పాంగి అప్పారావుకు చెందిన పెంకిటిల్లు కూలిపోయింది. అలాగే వరద నీటి ఉధృతికి పంట పొలాలు నీట మునిగాయి. గూడెంకొత్తవీధి మండలంలోని దేవరాపల్లి పంచాయతీ మంగళపాలెం గ్రామానికి చెందిన సిరిబాల రాంబాబు గృహంపై భారీ వృక్షం కూలింది. కుటుంబ సభ్యులందరూ పొలం పనికి వెళ్లిన సమయంలో చెట్టు పడడంతో పెను ప్రమాదం తప్పింది. పెదబయలు మండలంలోని భారీ వర్షాలతో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. అనేక గ్రామాలు అంధకారంలోనే మగ్గుతున్నాయి. సీతగుంట పంచాయతీ గడ్డికాలనీలోని పాంగి కొండబాబు ఇంటి గోడ కూలిపోయింది. వనభంగి పంచాయితీ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల పైకప్పు రేకులు గాలివానకు ధ్వంసమయ్యాయి. వాగులు, గెడ్డ పాయలు పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వందల ఎకరాల్లో పంట పొలాలు నీటమునిగాయి. కుంతుర్ల పంచాయితీ కేంద్రంలో ఎ.రాంబాబు ఇంటిపై భారీ వృక్షం కూలడంతో కుటుంబీకులు స్వల్పంగా గాయపడ్డారు.


హుకుంపేట మండలం పాటిమామిడిలో నీటి ముంపులో ఉన్న వరి పొలాలు


ముంచంగిపుట్టు సమీపంలోని దోనిపుట్టు వద్ద కొట్టుకుపోయిన పంట పొలాలు


డుంబ్రిగుడ: ఉధృతంగా ప్రవహిస్తున్న కొసొంగుడ కాజ్‌వే



గూడెంకొత్తవీధిలోని మంగళపాలెం, పెదబయలులోని కుంతుర్లలో ఇళ్లపై కూలిన వృక్షాలు

చురుగ్గా ఏసీఎం మందు స్ప్రేయింగ్: ఏఎంవో


స్ప్రేయింగ్ పరిశీలిస్తున్న ఏఎంవో సత్యనారాయణ

కొయ్యూరు, జూలై 26: దోమల నివారణకు రెండో విడత ఆల్ఫా సల్ఫర్ మైత్రేన్ (ఏసీఎం) మందు స్ప్రేయింగ్ చురుగ్గా జరుగుతున్నదని సహాయ మలేరియా నివారణాధికారి సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఈ ప్రక్రియను పరిశీలించారు. కొయ్యూరు, జీకే వీధి, చింతపల్లి మండలాల్లో 303 గ్రామాలన స్ప్రేయింగ్‌కు ఎంపిక చేయగా, ఇప్పటికే 103 గ్రామాల్లో స్ప్రేయింగ్ పూర్తయిందని చెప్పారు. వచ్చే నెల 15లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా, వర్షాల కారణంగా అంతరాయం ఏర్పడడంతో ఆగస్టు నెలాఖరుకు పూర్తి చేసేలా చర్యలు చేపట్టామన్నారు. మలేరియా నివారణకు చర్యలు ముమ్మరం చేశామని ఏఎంవో తెలిపారు.

పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక శ్రద్ధ


సుండ్రుపుట్టు కాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న ఎంపీడీవో సాయినవీన్

పాడేరు రూరల్, జూలై 26: మండలంలో సీజనల్ వ్యాధుల నివారణకు పారిశుధ్యం మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టిసారించామని ఎంపీడీవో కె.సాయినవీన్ చెప్పారు. చింతల వీధి పంచాయతీలోని శుక్రవారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి డ్రమ్ములు, కుండీల్లో నిల్వ నీటిని తొలగించారు. ఇళ్ల పరిసరాలు, కాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నందు కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ పారిశుధ్యం మెరుగుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పీవీ.రమేష్, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యుల డిప్యుటేషన్ రద్దు చేయాలని నిరసన


ఏరియా ఆస్పత్రి ఎదుట నినాదాలు చేస్తున్న నాయకులు

చింతపల్లి, జూలై 26: పాడేరు జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న చింతపల్లి ఏరియా ఆస్పత్రి వైద్యుల డిప్యుటేషన్ రద్దు చేయాలని ఎన్డీఏ కూటమి నాయకులు నిరసన తెలిపారు. ఏరియా ఆస్పత్రి ఎదుట శుక్రవారం చేపట్టిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు మాట్లాడుతూ వైసీపీ పాలకుల అండదండలతో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి చెందిన ఇద్దరు గైనికాలజిస్టులు డిప్యుటేషన్‌పై జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. దీంతో ఇక్కడ ఒకే గైనికాలజిస్టు ఉండడం, ఆమె కూడా సెలవుపై వెళ్లిపోవడం వల్ల గర్భిణులు, బాలింతలకు వైద్యం అందడంలేదన్నారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి ఇద్దరు గైనికాలజిస్టులను చింతపల్లి ఏరియా ఆస్పత్రికి పంపించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూటమి సీనియర్ నాయకులు రీమల ఆనంద రావు, చింతాడ చిన్న, బౌడు కుశలవుడు, కేశ్వరరావు, అంద్రాబు లక్ష్మణ్ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి: ఎంపీడీవో


వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో నగేష్, తదితరులు

అనంతగిరి, జూలై 26: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో నగేష్ సూచించారు. మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీ కేంద్రంలోని డ్రై డే-డ్రై డే కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా కుటుంబంతో పాట ఆరోగ్యంగా ఉంటారన్నారు. వాడుక నీరు నిల్వలేకుండా చూడాలని, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. అనంతరం అనంతగిరి పీహెచ్‌సీ పరిధిలోని శివలింగపురం గ్రామంలో రెండో విడత దోమల నివారణ మందు పిచికారీ పనులను ఎంపీడీవో నగేష్ పరిశీలించారు. దోమల నివారణకు ఓ వైపు స్ప్రెయింగ్, మరోవైపు ఫాగింగ్ యంత్రాలు ద్వారా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వరలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ విస్తరణలో బాధితులకు పరిహారం చెల్లించాలి


వినతిపత్రం అందజేస్తున్న లంబసింగి గిరిజనులు

చింతపల్లి, జూలై 26: జాతీయ రహదారి విస్తరణలో గృహాలను నష్టపోతున్న బాధితులకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించాలని లంబసింగి గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాడేరులో శుక్రవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. తాత ముత్తాతల కాలం నుంచి పూరిల్లు నిర్మించుకుని నివాసం సాగిస్తున్నామని, 1983లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆస్తి నష్టపోయామని, అప్పటి నుంచి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. నాలుగైదేళ్ల క్రితం పక్కా గృహాలను నిర్మించుకున్నామని, ప్రస్తుతం జాతీయ రహదారిలో సుమారు 50 కుటుంబాలు పక్కా గృహాలను కోల్పోతున్నామని తెలిపారు. తమకు ప్రభుత్వం శతశాతం పరిహారం చెల్లించాలని కకోరారు. లేనిపక్షంలో గృహాలను తొలగించేందుకు అంగీకరించేదిలేదని గిరిజనులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు గసాడి శ్రీను, వర ప్రసాద్, ఆనంద్, గోపాల్, గిరిబాబు, పడాల్ పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గూడెంకొత్తవీధి, జూలై 26: పంటలు కాపాడుకునేందుకు రైతులు ప్రత్యేక సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చింతపల్లి ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బయ్యపురెడ్డి చెప్పారు. మండలంలోని సంకాడ, పెదవలస, లక్ష్మవరపుపేట, కొత్తపాలెం పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం పర్యటించి పంట నష్టాలను గుర్తించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ పొలాల్లో నీరు నిల్వ ఉండడం వల్ల పంటలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని, నీటిని బయటకు పోయే మార్గాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. నారుమడి దశలోనున్న వరిలో కిలో యూరియా, ఒక లీటరు పొటాష్ కలుపుని పెట్టుకోవాలన్నారు. నారుమడిలో తెగుళ్ల నివారణకు ఒక లీటరు నీటిలో ఒక గ్రాము కార్బెండిజం మందు కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. 15-21 రోజుల వయస్సు కలిగిన నారును వరి మడుల్లో నాటుకోవాలని, 15 రోజుల నుంచి చిరు పొట్ట దశ వరకు పొలంలో పలుచగా నీరు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

కట్టల శివారున తుంచి నాట్లు వేయండి

కొయ్యూరు, జూలై 26: వరి నారు కట్టల శివారున తుంచి నాట్లు వేయాలని మండల వ్యవసాయ శాఖాధికారి ఉమాదేవి సూచించారు. రేవళ్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నారు కట్టల వేర్లను సూడోమోనాస్ ద్రావణంలో ఉంచి నాట్లు వేయటం ద్వారా వేర్ల ద్వారా వచ్చే తెగుళ్లను అరికట్టవచ్చని చెప్పారు. అలాగే పంటల సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలను ఆమె వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల భవనాలు అప్పగించాలని ధర్నా

పాడేరు రూరల్, జూలై 26: ఎన్నికల కమిషన్ ఆధీనంలో ఉన్న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన తరగతి గదులను తక్షణమే అప్పగించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ప్రతినిధులు శుక్రవారం ఐటీడీఏ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఎన్నికలు ముగిసి రెండు నెలలు కావస్తున్నప్పటికీ ఈ గదులను అప్పగించకపోవడంతో విద్యార్థులకు వసతి సమస్య ఏర్పడుతుందని ఏఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కొర్రా రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తక్షణమే తమ తరగతి గదులను అప్పగించి వసతి సమస్య తీర్చాలని కోరారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఎఫ్ఐ ప్రతినిధులు, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ పద్ధతిలో నాట్లు వేస్తే అధిక దిగుబడి

చింతపల్లి, జూలై 26: ఆదివాసీ రైతులు శ్రీ (వరుసలు) పద్ధతిలో నాట్లు వేసుకుంటే అధిక దిగుబడులు పొందచ్చునని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు సూచించారు. కొమ్మంగి పంచాయతీలో వరుసల్లో వరి నాట్లు వేసుకునే విధానంపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరి నాట్లు వేసేందుకు పూర్వ పద్ధతులను విడిచి పెట్టాలన్నారు. వరుసల్లో నాట్లు వేసుకోవడం వల్ల మొక్కల నుంచి అధికంగా పిలకలు వచ్చి దిగుబడి పెరుగుతుందని ఆయన వివరించారు. అలాగే కౌలు రైతులకు గుర్తింపు కార్డులను జారీ చేస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో భారతి, ఉద్యాన, వ్యవసాయ సహాయకులు కైలాశ్ పతి, రాజు, శోభన్ పాల్గొన్నారు.

గర్భిణులకు నిలిచిన వైద్య సేవలు

... 5వ పేజీ తరువాయి

మాత్రమే ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. ఆమె కూడా చైల్డ్ కేర్ సెలవుపై వెళ్లారు. ఇక్కడ ఉండాల్సిన మరో ఇద్దరు స్త్రీ వైద్యనిపుణులు శ్రీలత, ప్రవీణలు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులతో పైరవీలు చేసుకొని పాడేరు జిల్లా ఆస్పత్రికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. ప్రస్తుతం వారు జిల్లా ఆస్పత్రి నుంచి ఇక్కడ ఏరియా ఆస్పత్రికి వచ్చేందుకు నిరాకరిస్తున్నారు. ఇక్కడ స్త్రీ వైద్యనిపుణులు అందుబాటులో లేకపోయినా వైద్య విధాన పరిషత్, జిల్లా అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు.

గర్భిణులకు తప్పని ప్రసవ వేదన..

ప్రసవం కష్టమైతే గర్భిణులకు వేదన తప్పడం లేదు. చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో కేవలం సహజ ప్రసవాలు మాత్రమే జరుగుతున్నాయి. సిజేరియన్ అవసరమైతే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్నారు. గర్భిణి పురిటి నొప్పులతో బాధపడుతూనే 50 కిలోమీటర్లు వాహనంలో ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. గతంలో గర్భిణులను అంబులెన్స్‌లో నర్సీపట్నం తరలిస్తుండగా మార్గ మధ్యలో తల్లి, శిశువు మరణించిన సందర్భాలు ఉన్నాయి.

నిలిచిపోయిన సిజేరియన్‌లు

చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో కొన్ని నెలలుగా సిజేరియన్‌లు నిలిచిపోయాయి. ఆస్పత్రిలో కేవలం ఒక స్త్రీ వైద్యనిపుణులు ఒక్కరే విధుల్లో ఉండడం, అనస్థీషియా(మత్తు) వైద్యాధికారులు అందుబాటులో లేకపోవడంతో సిజేరియన్‌లు జరగడం లేదు. ఆస్పత్రిలో పేరుకు ఇద్దరు అనస్థీషియా వైద్యులు ఉన్నప్పటికీ కొన్ని నెలలుగా ఇద్దరూ విధులకు గైర్హాజరవుతున్నారు. ఉన్నతాధికారులు సైతం పట్టించుకోవడం లేదు. అలాగని కొత్తవారిని నియమించడం లేదు.

వరదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

... 5వ పేజీ తరువాయి

సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలన్నారు. ఈదురుగాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడే ప్రమాదముందని, అనవసరంగా బయట తిరగవద్దని పీవో సూచించారు.

మీ కోసంలో 75 వినతులు స్వీకరణ

ఐటీడీఏ కార్యాలయంలో పీవో అభిషేక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో గిరిజనులకు నుంచి వివిధ సమస్యలపై 75 వినతులను అధికారులు స్వీకరించారు. తమ గ్రామానికి చెక్‌డ్యామ్ మంజూరు చేసి పంట పొలాలకు సాగు నీరు అందించాలని చింతపల్లి మండలం చౌడుపల్లి గ్రామానికి చెందిన వి.రామునాయుడు, పాంగి రాజారావు, జి.రాము, వి.గురుమూర్తి, కిల్లో గంగాధర్ కోరగా, హుకుంపేట మండలం అడ్డుమండ గ్రామానికి చెందిన జి.దేముడమ్మ వరదలకు తన ఇల్లు కూలిపోయిందని నష్టపరిహారం అందించాలని కోరారు. అలాగే అరకులోయ మండలం మడగడ పంచాయతీ గంగుడి గ్రామానికి చెందిన వి.సింగ్, వి.పిల్కు రేషన్‌కార్డులు కావాలని, ఇదే పంచాయతీ వంతమూరు గ్రామానికి చెందిన కె.శంకరరావు, కె.భగవాన్, కె.సింహాద్రి, కె.రఘునాథ్ తదితరులు తమ గ్రామానికి తాగునీటి సమస్య ఉందని తెలిపారు. చింతపల్లికి చెందిన కాగి వెంకయమ్మ తన భూమిని ఆక్రమించారని, న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, ఐటీడీఏ ఏపీవోలు వీఎస్.ప్రభాకర రావు, ఎం.వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈలు డీవీఆర్ఎం.రాజు, వేణుగోపాల్, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, హౌసింగ్ డీఈఈ వి.రాజబాబు పాల్గొన్నారు.

కల్వర్టులకు ప్రతిపాదనలు పంపండి

... 5వ పేజీ తరువాయి

పంచాయతీలో వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి, పరిహారం అందజేస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. తియ్యమామిడి నుంచి మెట్టపాడు వరకు బీటీ రహదారి మంజూరు చేస్తామన్నారు. అనంతరం పెదలోచలి ఆశ్రమ పాఠశాలను పీవో అభిషేక్ తనిఖీ చేశారు. పాఠశాలలో 133 మందిగాను 94 మంది విద్యార్థులు ఉండడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తొమ్మిదవ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠాలు బోధించనందుకు, విద్యార్థులు గైర్హాజరుపై హెచ్ఎంకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తర్వాత కిల్లంకోట మార్గంలో బొయితిలి పంచాయతీ రాసవీధి సమీపంలో వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టును పరిశీలించారు. అనంతరం జి.మాడుగుల పీహెచ్‌సీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని పరిశీలించారు. అక్కడి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, డీఈఈ అనుదీప్, ఏఈ దుర్గాప్రసాద్, మండల ఇంజనీర్ అధికారి ఎస్.మాణిక్యం, తహసీల్దార్ నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

జన జీవనం అస్తవ్యస్తం

... 5వ పేజీ తరువాయి

చాలా ఘటనలున్నాయి.

పొంగుతున్న గెడ్డలతో జనం అవస్థలు

జిల్లాలో వరదల ప్రభావంతో పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇప్పటికీ వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడంతో గెడ్డలు ఉధృతంగా ఉన్నాయి. ముఖ్యంగా ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల, డుంబ్రిగుడ మండలాల్లో ఈ పరిస్థితి అధికంగా ఉంది. గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో అవతల ఉన్న గిరిజనులు వారం రోజులుగా ఊళ్లకే పరిమితమయ్యారు. అత్యవసర పరిస్థితుల్లో పెదబయలు మండలం జామిగుడ గెడ్డను దాటేందుకు గిరిజనులు ఆనపకాయ డిప్పలను మొలకు కట్టుకుని గెడ్డను దాటుకుంటూ వెళుతున్నారు. ఇదే విధానాన్ని ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం. బుంగాపుట్టు పంచాయతీలకు చెందిన గిరిజనులు అనుసరిస్తున్నారు. పదుల సంఖ్యలో గిరిజన పల్లెలకు చెందిన గిరిజనులు గెడ్డల సమస్య కారణంగా ఇళ్లలోనే ఉంటున్నారు. ఇదిలా ఉండగా వరదల కారణంగా మారుమూల ప్రాంతాల్లోని రోడ్లు సైతం ధ్వంసమయ్యాయి. చిన్నచిన్న కాజ్‌వేలు, కల్వర్టులు సైతం దెబ్బతింటున్నాయి. వర్షాలు కొనసాగడం, రోడ్లు పాడవడం వంటి ఘటనలతో ఏజెన్సీలో వారపు సంతలు సరిగా జరగని పరిస్థితి కొనసాగుతున్నది. వాస్తవానికి గిరిజనులకు వారపు సంతలు ఎంతో ప్రధానం. వారి అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించుకోవడం, అదే క్రమంలో వారికి అవసరమైన నిత్యావసర సరకులను కొనుగోలు చేసుకోవడం వంటి ముఖ్యమైన క్రయవిక్రయాలు సంతలోనే జరుగుతాయి. అవన్నీ ప్రస్తుతం నిలిచిపోయాయి. అలాగే అక్కడక్కడ చెట్లు కూలిపోవడం వంటి ఘటనలతో పాటు విద్యుత్ తీగలు తెగిపోవడం వంటి ఘటనలు అధికంగా జరుగుతున్నాయి. దీంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విద్యుత్ సిబ్బంది రాత్రింబవళ్లు శ్రమిస్తూ విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. అలాగే వరద నీటితో వరి నాట్లు పూర్తయిన పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. అలాగే అనేక ప్రాంతాల్లో వరి పంట కొట్టుకుపోతున్నది. ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాలతో గిరిజనుల జీవనానికి ఇలా తీవ్ర అంతరాయంగా మారుతున్నాయి. దీంతో ఈ వర్షాలు ఎప్పుడు తగ్గుతాయేనని గిరిజనులు ఎదురు చూస్తున్నారు.

నేడు జిల్లాలో ప్రాథమిక పాఠశాలలకు సెలవు

పాడేరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరదల తీవ్ర తగ్గకపోవడంతో శనివారం జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలకు మాత్రమే సెలవును పొడిగిస్తున్నామని, ప్రాథమికోన్నత, ఉన్నత, ఆశ్రమ, గురుకుల పాఠశాలలు యథావిధిగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే వరద ప్రభావం అధికంగా ఉన్న జిల్లాలోని చింతూరు, కూనవరం, వీఆర్.పురం, ఏటపాక మండలాల్లో అన్ని విద్యాలయాలకు సెలవులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ మార్పును విద్యాశాఖాధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలన్నారు.

వీడని ముసురు

... 5వ పేజీ తరువాయి

వాతావరణం కొనసాగుతునే ఉంది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు వర్షం పడుతునే ఉంది. దీంతో జన జీవనం దాదాపు స్తంభించిపోయింది. శుక్రవారం అరకు వారపు సంత అయినప్పటికీ వ్యాపారులు అరకొరగానే వచ్చారు. గెడ్డలు పొంగుతుండడంతో గిరిజనులు ఊర్లు దాటి రావడం లేదు. దీంతో సంతలో వ్యాపారాలు జరగడం లేదు. గత ఐదు రోజులుగా సుంకరమెట్ట ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రతి రోజూ విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా ఫలితం లేకపోతున్నదని గిరిజనులు వాపోతున్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

కొయ్యూరు, జూలై 26: పారిశుధ్య కార్యక్రమం నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో లాలం సీతయ్య హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాగునీటి పథకాల క్లోరినేషన్, పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై ఆకస్మిక తనిఖీలు ఉంటాయని, ఎక్కడ నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వతేజ, ఈవోపీఆర్‌డీ ఎస్‌కేవీ ప్రసాద్, ఎంఈవో రాంబాబు, సీహెచ్‌వో ప్రశాంత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

చింతపల్లి, జూలై 26: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో వీర సాయిబాబు చెప్పారు. మండలంలోని అంతర్ల, చింతపల్లి గ్రామాల్లో మంచినీటి పథకాల ట్యాంక్‌లను పరిశీలించి పంచాయతీ సిబ్బందితో క్లోరినేషన్ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు చేపట్టాల్సిన కార్యాచరణను వివరించామన్నారు. కాలువల్లో పూడిక తొలగింపు, నిల్వ నీరు కలిగిన ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడం చేస్తామన్నారు. దోమల నివారణకు ఫాగింగ్, వీధుల్లో బ్లీచింగ్ చల్లిస్తామన్నారు. గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కొరుప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

చింతపల్లి, జూలై 26: ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని తహసీల్దార్ టి.రామకృష్ణ సూచించారు. చిన్నగెడ్డ, లోతుగెడ్డ జంక్షన్, లంబసింగి గ్రామాల్లో జల దిగ్బంధంలో చిక్కుకున్న గృహాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల గ్రామాల్లో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.లోతుగెడ్డ జంక్షన్, చిన్నగెడ్డ గ్రామాల్లో 26 గృహాలు చుట్టూ చేరిన నీరు బయటకు పోయేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వర్షాల వల్ల గృహాలను నష్టపోయిన 25 మంది బాధితులకు నెల రేషన్ బియ్యం ఉచితంగా అందిస్తామని చెప్పారు.

పాడేరులో ఇండియన్ గ్యాస్ డోర్ డెలివరీ చేయాలి

పాడేరు రూరల్, జూలై 26: జిల్లా కేంద్రం పాడేరులో ఇండియన్ గ్యాస్‌ను డోర్ డెలివరీ చేసేలా ఐటీడీఏ అధికారులు చర్యలు చేపట్టాలని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ కోరారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుస్తున్న ఇండియన్ గ్యాస్ గొడౌన్ వద్ద తరచూ స్టాక్ లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్యాస్ కోసం గొడౌన్‌కు వెళ్లే లబ్ధిదారుల సిలిండర్లు గొడౌన్ వద్ద అపహరణకు గురైన సందర్భాలు ఉన్నాయన్నారు. పైగా గ్యాస్ బుకింగ్ ఎలాగూ ఆన్‌లైన్‌లో జరుగుతున్న నేపథ్యంలో ఐటీడీఏ అధికారులు స్పందించాలని కోరారు. అతని వెంట సీపీఐ నాయకులు లక్ష్మణరావు, రాంబాబు ఉన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

అనంతగిరి, జూలై 26: మత్తు పదార్థాల జోలికి పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ కరక రాము చెప్పారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల జోలికిపోవద్దని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండడంతో పాటు మిగిలిన వారికి కూడా చెప్పాలన్నారు. ప్రభుత్వ అవకాశాలను వినియోగించుకుని ఉన్నతంగా ఎదగాలని, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ధారాలమ్మ ఆలయంలో విద్యుత్ సరఫరా లేక భక్తుల ఇక్కట్లు

సీలేరు, జూలై 26: గూడెంకొత్తవీధి మండలంలోని ధారాలమ్మ ఆలయం వద్ద వారం రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండ ట్రాన్స్‌కో సిబ్బందికి ఈ సమస్యపై సమాచారం ఇవ్వడంతో శుక్రవారం ఆలయానికి చేరుకుని పరిశీలించారు. డీపీ పనిచేయడం లేదని, వేరే డీపీని మార్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని లైన్‌మాన్ గొర్లి కన్నాలు, సిబ్బంది తెలిపారు.

బాల్య వివాహాలతో చదువుకు దూరం కావొద్దు

హుకుంపేట, జూలై 26: బాల్య వివాహాలు చేసుకుని చదువుకు దురం కావొద్దని ఎస్ఐ సతీష్ సూచించారు. మండల కేంద్రంలోని బాలికల పాఠశాల శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ బాల్య, మేనరిక వివాహాలతో అనేక అనర్థాలు వస్తాయన్నారు. ప్రధానంగా భవిష్యత్తుకు ముప్పు వాటిల్లుతుందని చెప్పారు. చదువుపైనే దృష్టిసారించాలని, ఉన్నత విద్యనభ్యసించి చక్కగా ఎదగాలని కోరారు. సదస్సులో ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

జామిగూడ ఆశా కార్యకర్త మృతి

పెదబయలు, జూలై 26: మండలంలో రూడకోట పీహెచ్‌సీ పరిధిలోని మారుమూల జామిగూడ పంచాయతీ కేంద్రానికి చెందిన ఆశా కార్యకర్త మఠం కుమారి (48) గురువారం రాత్రి మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె పాడేరు జిల్లా ఆస్పత్రి, అక్కడి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు వెళ్లి చికిత్స పొందారు. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో స్వగ్రామానికి వచ్చేశారు. గురువారం రాత్రి పరిస్థితి విషమించి మరణించినట్టు కుమారి భర్త బాబూరావు ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఐదుగురు పిల్లలు ఉన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ కార్యకర్త...

జి.మాడుగుల, జూలై 26: అనారోగ్యంతోవిశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ జి.మాడుగుల పంచాయతీ వైబీ గొందుకురుకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త తుర్రె చంద్రమ్మ మృతి చెందారు. గురువారం గుండె నొప్పి రావడంతో పాడేరు జిల్లా ఆసుపత్రిలో కుటుంబీకులు చేర్పారు. పరిస్థితి విషమంగా గుర్తించిన వైద్యులు కేజీహెచ్‌కు పంపించగా, అక్కడి వైద్య సేవలు పొందుతూ శుక్రవారం మృతి చెందింది. చంద్రమ్మ మృతి పట్ల పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు సంతాపం తెలిపారు.